నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 14 అక్టోబర్ 2024 | SURYAPET

# సర్వ మతాల సారాంశం మానవత్వమే

- తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు యావత్ దేశానికే ఆదర్శం
- అన్ని వర్గాల ఆనందంతోనే ఆరోగ్యవంతమైన సమాజం
- దసరా వేడుకల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- క్యాంపు కార్యాలయంలో ముస్లిం, క్రైస్తవులకు సామూహిక విందు

సూర్యాపేట, అక్టోబర్ 13(నమస్తేతెలంగాణ) : సర్వమతాల సారాంశం మానవత్వమేనని. అన్ని వర్గాల ఆనందమే ఆరోగ్యవంతమైన సమాజం అవుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రతి ఏడాది మాదిరిగానే సూర్యాపేట పట్టణానికి చెందిన ముస్లిం, క్రైస్తవులకు సామూహిక విందు ఏర్పాటు చేశారు. వారితో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకొనే తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు యావత్ దేశానికే ఆదర్శమన్నారు. ఉద్యమ సమయంలోనే అన్ని వర్గాల ఐక్యతను చాటిన గొప్ప వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ అని తెలిపారు. అన్ని మతాల ప్రధాన పండుగలకు కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించడంతో ఐక్యతతో వేడుకలు జరుపుకొన్నామని గుర్తు చేశారు. క్రిస్మస్ ప్రేమ విందు, రంజాన్ ఇఫ్తార్ విందు, తోఫా, దుస్తుల పంపిణీ అన్ని మతాల పట్ల కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనాలే అని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సూర్యాతపేట ఎంతో అభివృద్ధి జరిగిందని, అన్ని వర్గాల్లో ఐక్యత పెరిగిందని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా చెక్కు చెదరని ఐక్యత సూర్యాపేట ప్రజలదని, భవిష్యత్తులోనూ ఇదే ఐక్యతతో ముందుకు సాగుదామని తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో కమిటీ సభ్యులుగా ముస్లిం యువత భాగస్వామ్యం అయ్యారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మతాల పెద్దలు సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ఎం.ప్రభుదాస్, మామిడి శ్యాంసన్, మీసాల గోవర్ధన్, పి.పూర్ణ శశికాంత్, బొజ్జ ప్రశాంత్, కౌన్సిలర్ ఎస్.కె.తాహేర్ పాష, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎస్‌డీ రియాజుద్దీన్, తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

# మధుసూదనాచారికి శుభాకాంక్షలు





మధుసూదనచారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, అక్టోబర్ 13 : శాసన మండలి ప్రతిపక్ష నేతగా మాజీ శాసన సభ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తోపాటు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పలువురు బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మధు సూదనాచారికి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించారు.

# సంబురంగా దసరా

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా విజయ దశమి వేడుకలు



సూర్యాపేటలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సునీత దంపతులు, మాజీ ఎంపీ బడుగుల

- భక్తులతో సందడిగా దేవాలయాలు.. శమీ వృక్షానికి పూజలు
- అంతటా వాహన, ఆయుధ పూజలు
- పలుచోట్ల కోలాహలంగా రావణాసుర వధ కార్యక్రమాలు
- వేడుకల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీక విజయ దశమి వేడుక. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల అనంతరం శనివారం ప్రజలు దసరా పండుగగా సంబురంగా జరుపుకొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉండే వారంతా పండుగకు తమ సొంతూళ్లకు రావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాలన్నీ సందడిగా కనిపించాయి. మరో వైపు పలు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం శమీ వృక్షాన్ని పూజలు చేశారు. పట్టణాల్లో ప్రత్యేకంగా పాలపిట్ట దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యుల ఆత్మీయ ఆలింగనాలు, ఆశీర్వచనాలు, బంధుమిత్రుల అలయ్ బలయ్ అందరిలో ఆనందాలు నింపింది. పలుచోట్ల రావణాసుర వధ కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద ఎత్తున జనం పాల్గొని పటాకులు కాల్చి, కేరింతలతో హోరెత్తించారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నారు.

– రామగిరి, /సూర్యాపేట టౌన్ అక్టోబర్ 12



నల్లగొండ రాక్‌హిల్స్ కాలనీలో పాలపిట్టను దర్శించుకుంటున్న జనం



నల్లగొండ వివేకానందనగర్ కాలనీలో రావణ దహనం





సూర్యాపేటలో జమ్మి దర్శనానికి వచ్చిన జనం

# తెల్లబంగారం.. దళారులపరం!



## జిల్లాలో నేటికీ ప్రారంభంకాని సీసీఐ కేంద్రాలు

- అప్పుల బాధ తట్టుకోలేక తక్కువ ధరకే అమ్మివేత
- క్వింటాకు రూ.1500 వరకు నష్టపోతున్న రైతులు
- తరుగు పేరుతో క్వింటాకు రెండు కేజీలు కోత
- జిల్లాలో 5.45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు



నల్లగొండ, అక్టోబర్ 13 : వానకాలం సీజన్‌లో రైతు పండించిన తెల్లబంగారాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదు. ఇప్పటికే రెండు పికింగ్స్ పత్తి చేతికి వచ్చినప్పటికీ సీసీఐ కేంద్రాలు ప్రారంభించ లేదు. పెట్టుబడి ఖర్చులు, అప్పుల బాధ తట్టుకోలేక రైతులు పత్తిని తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తున్నది. ప్రస్తుతం మద్దతు ధర క్వింటాకు రూ.7,521 పలుకుతుండా గ్రామాల్లో ఇప్పటికే తిష్ట వేసిన దళారులు నాణ్యత, తేమ పేరుతో క్వింటాకు రూ.6,000 నుంచి రూ.6 300 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. దాంతో రైతులు క్వింటాకు రూ.1200 నుంచి రూ.1500 వరకు నష్టపోతున్నారు. అయితే జిల్లాలో పత్తి కొనుగోలు చేయడానికి 23 జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు టెండర్లల్లో పాల్గొనగా పత్తి కొనుగోలు చేసే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) మాత్రం వారిని ఇప్పటివరకు నోటిఫై చేయలేదు. దాంతో మార్కెటింగ్ యంత్రాంగం కూడా చేతులు ముడుచుకొని కూర్చుంది. ఈ నేపథ్యంలో పత్తి రైతులు దళారుల చేతిలో దగా పడుతున్నారు.

**ఏటా అక్టోబర్ ఫస్ట్ నుంచే..**

సాధారణంగా ఏటా సెప్టెంబర్ నుంచి పత్తి పంట తొలి పికింగ్ షురూ కానుండగా అక్టోబర్ ఫస్ట్ నుంచి సీసీఐ కేంద్రాలు పత్తి కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తాయి. గతేడాది మద్దతు ధర కంటే మార్కెట్ ధర ఎక్కువగా ఉండటంతో సీసీఐ కేంద్రాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కానీ ఈ సారి సాగు పెరుగడంతోపాటు పంట ఉత్పత్తి కూడా ఎక్కువగా వస్తున్నందున మద్దత ధర కంటే మార్కెట్‌లో తక్కువగా ఉంది. దీంతో సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నప్పటికీ సీసీఐ ప్రతినిధు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం కూడా సీసీఐ ఒత్తిడి తేవడంలో విఫలమైంది.

**సీసీఐ నోటిఫై చేస్తేనే..**

నల్లగొండ జిల్లాలో 5,45, 251 ఎకరాల్లో పత్తి సాగు కాగా 3.56 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి రానున్నది అధికారుల అంచనా. గతేడాది కంటే ఈ సారి పత్తి దిగుబడి ఎక్కువ రానుండడంతో త్వరగా సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ సైతం ఆదేశించారు. దాంతో 23 జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు టెండర్లలో పాల్గొన్నారు. వీటిని గుర్తించడంలో సీసీఐ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. సీసీఐ నోటిఫై చేస్తేనే మార్కెటింగ్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది.

**దళారులకు విక్రయిస్తున్న రైతులు..**

ఈ సీజన్‌కు సంబంధించిన పత్తి ఇప్పటికే ఒకటి రెండు పికింగ్స్ పూర్తి కావడంతో రైతులు విక్రయానికి సిద్ధమయ్యారు. సీసీఐ కేంద్రాలు లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తున్నది. అప్పులు తెచ్చి పంటకు పెట్టుబడులు పెట్టడం, వాటికి వడ్డీలు పెరుగడం వల్ల రైతులు పత్తిని నిల్వ చేసుకునే పరిస్థితులు లేవు. ప్రస్తుతం సీసీఐ మద్దతు ధర ప్రకారం క్వింటా పత్తి రూ.6,521 ఉండగా దళారులు మాత్ర రూ.6,00 నుంచి రూ.6300 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు అంటున్నారు. పైగా క్వింటాకు రెండు కేజీలు తరుగు కూడా తీస్తున్నట్లు చెప్తున్నారు. సీసీఐ కేంద్రాలు లేకపోవడం, అందులో విక్రయించినా డబ్బులు ఆలస్యంగా వస్తాయని రైతులు తక్కువ ధరకైనా దళారులకు అమ్ముతున్నారు.

### రైతులు తొందరపడి విక్రయించొద్దు

జిల్లాలో పత్తి కొనుగోలు చేయడానికి 23జిన్నింగ్ మిల్లుల నుంచి టెండర్లు వేయగా, వాటిని నోటిఫై చేయాలని సీసీఐని ఫోర్స్ చేస్తున్నాం. నోటిఫై చేయగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. గ్రామాల్లో తక్కువ ధరకు పత్తి విక్రయిస్తున్నట్లు మా దృష్టికి కూడా వచ్చింది. కానీ రైతులు తొందర పడి విక్రయించి నష్టపోవద్దు. 8శాతం తేమతో తీసుకొస్తే మద్దతు ధర ఇస్తాం. ఆ తర్వాత తేమ 12శాతం వరకు పెరిగినా తీసుకుంటాం. కానీ ఒక్కో శాతానికి ధర ఉంటుంది.

**-చాయాదేవి, మార్కెటింగ్ ఏడీ, నల్లగొండ**

# శోభాయమానం



నేరేడుచర్లలో అమ్మవారి శోభాయాత్రలో మహిళలు

- జిల్లా వ్యాప్తంగా కనుల పండువగా దుర్గామాత నిమజ్జనోత్సవాలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు పరిపూర్ణం కావడంతో పలు చోట్ల ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, ఆటపాటలు, కోలాటాలతో అమ్మవారి శోభాయాత్రను నిర్వహించారు. భక్తులు, భవానీ దీక్ష స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ సందర్భంగా ప్రసాదాల వితరణ, అన్నదానాలు చేపట్టగా గ్రామాలు, పట్టణాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

# హైవేపై వాహనాల రద్దీ

## సొంతూళ్ల నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం



చౌటుప్పల్ పట్టణంలో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్‌రూరల్, అక్టోబర్ 13 : దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. వివిధ ప్రాంతాల నుంచే వెళ్లే వాహనాలతో రహదారులు రద్దీగా మారాయి. విజయవాడ–హైదరాబాద్ హైవేపై ఆదివారం పలుచోట్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద, చౌటుప్పల్ పట్టణంలో వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు ట్రాఫిక్ సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు.

# పండుగ పూట ట్రిపుల్ ఆర్ పిడుగు

## దసరా రోజు ట్రిపుల్ ఆర్ రైతులకు బహిరంగ నోటీస్

- 3జీ నోటిఫికేషన్ విడుదల చేసిన చౌటుప్పల్ ఆర్డీఓ
- భూములు ప్రభుత్వానికి సంక్రమించాయంటూ వెల్లడి
- చౌటుప్పల్‌లో 6, వలిగొండ మండలంలో 5గ్రామాల్లో కోల్పోనున్న భూములు
- 21నుంచి 25వ తేదీ వరకు అవార్డు పాస్ కోసం వివరాల సేకరణ
- ఇప్పటికే పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్న భూనిర్వాసితులు
- ఎట్టి పరిస్థితుల్లో భూములిచ్చేది లేదని అల్టిమేటం



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : దసరా పండుగ పూట ట్రిపుల్ ఆర్ రైతులపై సర్కార్ పిడుగు వేసింది. విజయదశమి రోజున బహిరంగ నోటీస్ ఇచ్చింది. వలిగొండ, చౌటుప్పల్ మండలాల గ్రామాలకు చెందిన భూములు ప్రభుత్వానికి సంక్రమించాయంటూ అందులో పేర్కొంది. ఇందులో భాగంగా చౌటుప్పల్ ఆర్డీఓ 3జీ నోటిఫికేషన్ జారీ చేశారు. అవార్డు పాస్ కోసం వివరాలు తీసుకోనున్నారు. ఇప్పటికే పెద్దఎత్తున ఉద్యమిస్తున్న రైతులు మాత్రం భూములు ఇచ్చేది లేదని అల్టిమేటం జారీ చేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భారత్ మాల పరియోజన కింద రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్ ప్రకారం ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం మొత్తం సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 19 మండలాలకు చెందిన 113 గ్రామాల మీదుగా వెళ్తున్నది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 34 గ్రామాల మీదుగా ఆర్ఆర్ఆర్ నిర్మించనున్నారు. జిల్లాలో 59.33 కిలోమీటర్లు ఉండనుంది. అందుకు తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో 1,927 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. దీనికి సంబంధించి త్రీడీ నోటిఫికేషన్ కూడా జారీ అయ్యింది.

**3జీ నోటిఫికేషన్ విడుదల..**

చౌటుప్పల్ మండలంలోని ఆరు గ్రామాలు, వలిగొండ మండలంలోని ఐదు గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ రోడ్డు వెళ్తున్నది. ఆయా చోట్ల 133.178 కిలోమీటర్ నుంచి 158,645 కిలోమీటర్ రహదారి నిర్మించనున్నారు. దీనికి సంబంధించి ఈ నెల ఒకటిన 3డీ నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. తాజాగా 12న 3జీ నోటిఫికేషన్ విడుదల చేశారు. 3డీ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఎలాంటి వివాదాలు లేవని, 3డీలోని సబ్ సెక్షన్ 2 ప్రకారం భూములు భారత ప్రభుత్వానికి సంక్రమించినట్లుగా బహిరంగ నోటీస్‌లో పేర్కొన్నారు. వలిగొండ మండలంలోని పొద్దుటూరు, రెడ్లరేపాక, పహిల్వాన్పూర్, గోకారం, వర్కట్‌పల్లి, చౌటుప్పల్ మండలంలోని తాళ్లసింగారం, చిన్నకొండూరు, తంగడపల్లి, నేలపట్ల, చౌటుప్పల్, లింగోజిగూడెం గ్రామాలకు సంబంధించి 213 ఎకరాల భూములను ప్రభుత్వం తీసుకోనుంది.

**అవార్డు పాస్ కోసం వివరాల సేకరణ..**

3జీ నోటిఫికేషన్‌లో భాగంగా ఎవరెవరి భూములు పోయాయో.. వారి నుంచి ఎంత తీసుకోనున్నారో తేలిపోనుంది. తర్వాతి దశలో అవార్డు పాస్ చేయనున్నారు. ఆయా భూములపై ఆసక్తి గల వ్యక్తులు స్వయంగా, మధ్యవర్తి ద్వారా లేదా న్యాయ సలహాదారు ద్వారా ఒరిజినల్ పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, వాటి జిరాక్స్ కాపీలను తీసుకొని, భూముల్లో ఉన్న నిర్మాణాలు, చెట్ల వివరాలతో ధ్రువీకరించుకోవాలని బహిరంగ నోటీస్‌లో పేర్కొన్నారు. ఒక వేళ నిర్ణీత సమయంలో క్లెయిమ్‌లు, కావాల్సిన డాక్యుమెంట్లు సమర్పించకుంటే రికార్డులను అనుసరించి నష్టపరిహారం లెక్కించనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు వలిగొండ మండలానికి చెందిన 5 గ్రామాల రైతులు ఈ నెల 21, 22 తేదీల్లో వలిగొండ తాసీల్దార్ కార్యాలయంలో, చౌటుప్పల్ మండలాల రైతులు 23, 24, 25 తేదీల్లో చౌటుప్పల్ తాసీల్దార్ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉంటుంది.

**ఇప్పటికే భూ నిర్వాసితుల పోరుబాట..**

ట్రిపుల్ ఆర్‌లో భాగంగా విలువైన భూములు పోతున్నాయని రైతులు పోరు బాట పట్టారు. ప్రధానంగా చౌటుప్పల్‌లో జంక్షన్ కు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సర్వం కోల్పోతున్నామని రైతులు లబోదిబోమంటున్నారు. సర్వే పనులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా సమావేశమయ్యారు. చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. పలుసార్లు స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద దీక్ష నిర్వహించారు. ఎంపీలతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రాలు అందించారు. ప్రభుత్వం మాత్రం ఆర్ఆర్ఆర్‌పై ముందుకే వెళ్తున్నది. రైతులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు.

# దసరా పండుగకు జాతీయ జెండా ఆవిష్కరణ

- బేగంపేటలో 76 ఏండ్లుగా సంప్రదాయం



బేగంపేటలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

రాజాపేట, అక్టోబర్ 13 : మండలంలోని బేగంపేటలో దసరా పండుగ రోజు జాతీయ జెండాను ఎగుర వేశారు. 76 ఏండ్లుగా గ్రామంలో సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు బద్దం నర్సిరెడ్డి, జిట్టా రాంచంద్రారెడ్డి, చిగుర్ల మల్లయ్య, బలిజ వీరయ్య కలిసి గ్రామ నడిబొడ్డున మొదటి సారిగా జాతీయ జెండా ఎగుర వేశారు. అప్పట్లో మూడు రంగుల జెండాను బోగ హనుమంత్ మగ్గంపై స్వయంగా నేసి, మేర నర్సయ్య వద్ద కుట్టించి, పెన్సిల్‌తో ధర్మచక్రం గీయించి గ్రామస్తులకు అందించేవారు. 30 ఏండ్లపాటు బోగ హనుమంత్ జాతీయ జెండాను తయారు చేశారు. ప్రతి సంవత్సరం దసరా పండుగతోపాటు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు మొత్తం మూడు సార్లు జాతీయ జెండాను గ్రామంలో ఆవిష్కరిస్తూ దేశ స్ఫూర్తిని చాటుతున్నారు. శనివారం దసరా పండుగకు గ్రామస్తులు పెద్దఎత్తున్న డప్పు చప్పుళ్లతో వెళ్లి జాతీయ జెండాను అవిష్కరించారు.